క్లుప్తంగా

మంత్రి విశ్వరూప్‌కు రాఖీ కట్టిన మహిళలు



మంత్రి విశ్వరూప్‌కు రాఖీ కడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కు పలువురు మహిళా ప్రజాప్రతినిధులు, మహిళలు గురువారం రాఖీలు కట్టి తమ ఆత్మీయ బంధాన్ని చాటారు. భట్నవిల్లిలోని మంత్రి విశ్వరూప్ ఇంటికి మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, మెప్మా ప్రతినిధి పాము శ్యామలతో పాటు పలువురు డ్వాక్రా సంఘాల మహిళలు మంత్రి విశ్వరూప్‌కు రాఖీలు కట్టారు.

ఎమ్మెల్యే పొన్నాడకు దస్తావేజు లేఖర్ల వినతి



ఎమ్మెల్యే పొన్నాడకు వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు

ముమ్మిడివరం: ప్రభుత్వం అమలుచేస్తున్న కార్డు 2.0 ప్రైమ్ రిజిస్ట్రేషన్ విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు వినతిపత్రం అందజేశారు. గురువారం ముమ్మిడివరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పొన్నాడను కలిసి కార్డు 2.0 ప్రైమ్ రిజిస్ట్రేషన్ వల్ల క్రయ విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో యల్లాప్రగడ జగన్నాథరావు, మంత్రి ప్రగడ వెంకట కృష్ణారావు, చవటపల్లి వెంకటేశ్వరరావు, తాడాల వీరబాబు, ఎ.గోపాలకృష్ణ తదితరులున్నారు.

వసతి గృహాల కోసం రూ.1.40 లక్షల విరాళం



ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవికి రూ.1.40 లక్షల చెక్‌ను అందజేస్తున్న బేబీ మీనాక్షి, దాత కుటుంబీకులు

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఆలయ అర్చకుల వసతి గృహాల కోసం పట్టణానికి చెందిన సన్‌షైన్ ప్రాపర్టీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేత చిక్కం పార్థసారథి రూ.1.40 లక్షలు సమకూర్చారు. సదరు మొత్తాన్ని రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ సతీమణి, మీనాక్షి ఫౌండేషన్ అధ్యక్షురాలు బేబీ మీనాక్షి చేతుల మీదుగా ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవికి ఆలయంలో గురువారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్త నడింపల్లి వర్మ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు వైభవంగా క్షీరాభిషేకం



ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని పి.మల్లవరం గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి గురువారం భక్తిశ్రద్ధలతో క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండివిల్లి శ్రీరంగాచార్యులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ విల్ల సత్యనారాయణ, చెల్లమకూరి భవాని, ఉంగరాల వెంకటేశ్వరరావు, వీరభద్రరావు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం చేస్తున్న పండితులు

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకుని గురువారం అమ్మవారికి చండీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, చండీ పారాయణ, చండీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి భరోసా

- వైఎస్సార్ సంపూర్ణ పోషణతో మాతాశిశువులకు ఎంతో మేలు
- గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం

ముమ్మిడివరం ఐసీడీఎస్ పరిధిలో వివరాలు

గర్భిణులు	- 1154
బాలింతలు	- 1093
మొత్తం	- 2247



గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న నేతలు

ముమ్మిడివరం: మాతాశిశువుల్లో రక్తహీనత, పౌష్టికాహార లేమిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలుచేస్తుంది. ఆరోగ్యవంతమైన భావితరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుకు వెనకాడకుండా టేక్ హోమ్ రేషన్ ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా రూ.850 విలువైన న్యూట్రిషన్ కిట్లను అందజేస్తుంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా గర్భిణులు, బాలింతలను నమోదు చేసి పది రకాల పోషకాలను అందిస్తున్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు, బాలింతలకు సమృద్ధిగా పాలు ఉండేందుకు అవకాశమేర్పడుతుంది. గర్భిణిగా నమోదైన నాటి నుంచి పుట్టిన బిడ్డకు ఆరో నెల పూర్తయ్యే వరకూ సమతుల ఆహారాన్ని అందిస్తున్నారు.

అందిస్తున్న పోషకాహారమిదే

టేక్ హోమ్ న్యూట్రిషన్ ద్వారా ప్రతి నెలా గర్భిణులు, బాలింతలకు అయిదు లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు, మూడు కిలోల బియ్యం, అర కిలో నూనె, కిలో కందిపప్పు, రెండు కిలోలు రాగి పిండి, ఒక కిలో అటుకులు, పావు కిలో బెల్లం, పావు కిలో వేరుశనగ చిక్కీ, పావు కిలో ఎండు ఖర్జూరం పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే అమల్లో ఉన్న వైఎస్సార్ అమృత హస్తం, మధ్యాహ్న భోజన పథకం, బాలామృతం, వైఎస్సార్ బాల సంజీవనికి అదనంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్నారు.

పౌష్టికాహారంతో ఎంతో మేలు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. గర్భిణులు, బాలింతలకు అవసరమైన పది రకాల పౌష్టికాహార సరకులు అందించాలన్న ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం. పైగా పౌష్టికాహార కిట్లను నేరుగా ఇంటికే అందిస్తుండడం బాగుంది.

– కాశి రామదుర్గ, బాలింత, గాడిలంక

పోషకాహారం విధిగా తీసుకోవాలి



మాతాశిశువుల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ప్రవేశపెట్టింది. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు విధిగా తీసుకుంటే రక్తహీనతను నివారించుకోవొచ్చు. గర్భిణిగా నమోదైన నాటి నుంచి ఆరో నెల బాలింత వరకూ ఇంటి వద్దకే సరకులు అందజేస్తున్నాం.

– ఐ.విమల, సీడీపీఓ, ముమ్మిడివరం

ఆలోచన అదిరింది.. ఖర్చు తగ్గింది



భీమనపల్లి గ్రామంలో పవర్‌టిల్లర్ సాయంతో నారుకట్టలను తరలిస్తున్న రైతు

ఉప్పలగుప్తం: వరినాట్ల సమయంలో రైతులు నాట్లు వేసే చోటుకు పొలం గట్ల నుంచి నారుకట్టలను తీసుకెళ్లేందుకు బుట్టలో ఉంచి నెత్తిన పెట్టుకుని బురదలో నడిచి వెళ్లటానికి నానా హైరానా పడేవారు. భీమనపల్లి పంచాయతీ పరిధికి చెందిన రైతు కొల్లపల్లి పట్టాభి తన పదెకరాల పొలంలో నాట్లువేసే ప్రదేశానికి నారుకట్టలను చేర్చడానికి సరికొత్త ఆలోచన అమల్లో పెట్టారు. పవర్ టిల్లర్‌కు వెనక భాగంలో తాడు సహాయంతో బరకాన్ని అమర్చి నారుకట్టలను దానిపై వేసి కావలసిన చోటుకు సులభంగా తీసుకెళుతున్నాడు. శ్రమతో పాటు కూలీల ఖర్చు తగ్గించుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని రైతు పట్టాభి చెబుతున్నారు. ఈ చిత్రాన్ని భీమనపల్లి పంచాయతీ పరిధి వడ్డి చెరువు గ్రామంలో గురువారం 'సాక్షి' కెమెరా క్లిక్ కనిపించింది.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం



అయినాపురంలో రహదారి నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: ప్రజా సంక్షేమంతో పాటు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం అయినాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కాట్రేనికోన ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి అయినాపురం బాడవ వరకూ ఏఐఐబీ నిధులు రూ.1.31 కోట్లతో చేపట్టిన రోడ్డు ఆధునీకరణ పనులకు బుధవారం ఆయన భూమి పూజ చేశారు. కోమటి చెరువులో ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే పొన్నాడ భూమి పూజ చేసి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, పెయ్యల చిట్టిబాబు, భూలక్ష్మి, కోలా బాబ్జి, సర్పంచ్ రామారావు, బొర్రా విష్ణు, ఎంపీడీఓ జె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విధిగా 100 రోజుల పని కల్పించాలి



పీడీ మధుసూదన్‌ను సత్కరిస్తున్న ఎంపీడీఓ రాంబాబు తదితరులు

ముమ్మిడివరం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు విధిగా 100 రోజులు పని కల్పించేందుకు ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ పీడీ ఎస్.మధుసూదన్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ జె.రాంబాబు అధ్యక్షతన అమలాపురం క్లస్టర్ పరిధిలోని ఉద్యోగులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మధుసూదన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పని కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్లాంటేషన్ పనులకు ప్రాధాన్యమిస్తూ హార్టికల్చర్‌లో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం పీడీ మధుసూదన్‌ను ఎంపీడీఓ జె.రాంబాబు దుశ్శాలువాతో సత్కరించారు. సమావేశంలో ఏపీఓలు, ఈసీలు, టీఏలు, సీఓలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో లక్ష్యం సాధించాలి



జిల్లా ఎస్పీ శ్రీధర్‌ను అభినందిస్తున్న చెయ్యేరు ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం

కాట్రేనికోన: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ లక్ష్య సాధనకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ శ్రీధర్ అన్నారు. చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో 2023–24 బీటెక్ మొదటి ఏడాది తరగతులను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ విద్యుర్థులు టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలన్నారు. కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ మాట్లాడుతూ కళాశాలలో కల్పించిన మౌలిక వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎస్.వాసుదేవరావు, డీఎస్పీ అంబికా ప్రసాద్, సీఐ కొండలరావు, ఎస్ఐ టి.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ పరమేశ్వరరావు, సందీప్, రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం చేయాలన్న కల సీఎం జగన్ నెరవేర్చారు



చప్పిడి సాయికృష్ణను దుశ్శాలువాతో సత్కరిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం: ఉపాధ్యాయ ఉద్యోగం చేయాలన్న కల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు చప్పిడి సాయికృష్ణ అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో పదవీ విరమణ సందర్భంగా గురువారం ఆయనను ఘనంగా సత్కరించారు. 1998 సంవత్సరంలో డీఎస్సీ ఉపాధ్యాయ ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులైన ఆయన ఇటీవలే ఎంటీఎస్ ఉపాధ్యాయునిగా నియమితులయ్యారు. మండలంలోని వాడపర్రు ఎంపీయూపీ పాఠశాలలో రెండు నెలల 18 రోజుల పాటు విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగం చేయాలన్నది తన జీవిత ఆశయమన్నారు. 1998లో జరిగిన డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినా టీడీపీ ప్రభుత్వ కక్ష పూరిత చర్యల కారణంగా ఉద్యోగం ఇవ్వలేదన్నారు. సీఎం జగన్ మా అర్హత గుర్తించి ఉద్యోగం చేసే అవకాశం కల్పించారని కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో కె.కిరణ్‌బాబు, ఎంఈవో–2 ఎస్.సత్యకృష్ణ, చిక్కం మైనర్‌బాబు, శ్రీనివాస్, ఆకుల పద్దయ్యనాయుడు, బొంతు శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం



కామనగరువులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శ్రీకాంత్

- మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్
- కామనగరువులో గడప గడపకూ మన ప్రభుత్వం

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు ప్రవేశపెట్టి మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చారని మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. కామనగరువులో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. సంక్షేమ పథకాల కారణంగా ప్రతి ఇంట్లోనూ ఆనందం వెల్లివిరిస్తోందన్నారు. వివక్షకు తావు లేకుండా ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పంపిణీ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్ గోపాల్, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, రాజులపూడి మురళీకృష్ణ, ఎంపీటీసీ మెండు గంగాభవాని, గుత్తుల అనిత తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల శ్రద్ధ వహించాలి



గోడితిప్ప సచివాయంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో కృష్ణమోహన్

అల్లవరం: సచివాలయ ఉద్యోగులు విధుల పట్ల శ్రద్ధ వహించాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని గోడితిప్ప, ఎంట్రికోన, గోడి సచివాలయాలను గురువారం ఆయన సందర్శించి పరిశీలించారు. గోడితిప్ప సచివాలయంలో కొందరు సచివాలయ ఉద్యోగులు విధులకు హాజరుకానట్లు గుర్తించానన్నారు. సచివాలయ ఉద్యోగులు క్షేత్ర స్థాయి పర్యటనకు వెళితే మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. 5 నుంచి 18 సంవత్సరాల పిల్లలకు చేస్తున్న ఈజీఆర్ సర్వే మండలంలో 100 శాతం పూర్తయ్యిందని, అదే విధంగా అన్నీ కార్యక్రమాల్లో ముందంజలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంట్రుకోన సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భార్యాభర్తలపై దాడి

అల్లవరం: ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో భార్యాభర్తలు గాయపడిన ఘటన మండలంలోని రెబ్బనపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వల కట్ల విషయంలో తలెత్తిన వివాదంలో గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, దుర్గ గాయపడ్డారు. ప్రస్తుతం వారిద్దరూ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రోజూ నాగేశ్వరరావు తాగి వచ్చి ఇబ్బంది పడుతుండడం వల్లే గొడవ జరిగిందని రెండో వర్గం చెబుతోంది. ఇరువర్గాలు భిన్న కారణాలు చెబుతున్న నేపథ్యంలో ఘటనపై విచారణ చేపట్టినట్లు అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐ.పోలవరం: మురమళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం మండలంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ డీఈ మోకా రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

అల్లవరం: మెయిన్‌రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు డీఈ ఎం.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా గోదావరి పున్నమి హారతి



గోదావరి మాతకు హారతి ఇస్తున్న మహిళలు

ఆలమూరు: జొన్నాడ వద్ద అఖండ గౌతమీ గోదావరి తీరంలో గోదావరి పున్నమి హారతి గురువారం వైభవంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా వేద పండితుడు ద్విభాష్యం రవికృష్ణ శర్మ ఆధ్వర్యాన మహిళా భక్తబృందం సభ్యులు గోదావరి మాతకు శాస్త్రోక్తంగా పున్నమి హారతి ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ మహిళలు జొన్నాడ శ్రీ శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయం నుంచి గౌతమీ పుష్కర ఘాట్‌కు ఊరేగింపుగా చేరుకున్నారు. గోదావరికి హారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని వివిధ ఆలయాల్లో విష్ణు, లలితా సహస్రనామ స్తోత్రం, కనకధార, అష్టోత్తరం, వేద పారాయణ చేశారు.

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ

రాజోలు: బోధన అంశాల్లో నైపుణ్యం పెంచేందుకు జరుగుతున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. మండలంలోని రాజోలు కో ఆపరేటివ్ స్కూల్, పొన్నమండ ఉన్నత పాఠశాలల్లోని రెండు కాంప్లెక్స్‌ల పరిధిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. మండలానికి చెందిన వ్యాయామోపాధ్యాయులకు రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ నల్లి మనోహరం మాట్లాడుతూ శిక్షణ ద్వారా విద్యార్థులకు కొత్త అంశాలపై విశ్లేషణాత్మకంగా బోధన చేసే వీలు కలుగుతుందన్నారు.

శాస్త్రోక్తంగా యజ్ఞోపవేతధారణ



వాసాలతిప్పలో ప్రత్యేక పూజలతో యజ్ఞోపవేతం ధరిస్తున్న అగ్నికుల క్షత్రియులు

ఉప్పలగుప్తం: జంధ్యాల పౌర్ణమి పురస్కరించుకుని వాసాలతిప్ప కోదండ రామాలయంలో కోనసీమ అగ్నికుల క్షత్రియ గౌరవ అధ్యక్షుడు కర్రి స్వామినాథ్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా యజ్ఞోపవేతధారణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. యువకులచే ప్రత్యేక పూజలు జరిపించి వారికి యజ్ఞోపవేతధారణ పవిత్రతను వివరించారు. కార్యక్రమంలో సంఘ కోనసీమ అధ్యక్షుడు చిలకపూడి రవికిరణ్, కొల్లు రాంబాబు, బలసాడి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రరావుకు ఘన నివాళి



చంద్రరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర కాపు నాయకులు విష్ణుమూర్తి, సురేష్ తదితరులు

అమలాపురం టౌన్: రాష్ట్ర కాపు రిజర్వేషన్ పోరాట సమితి మాజీ కన్వీనర్ నల్లా సూర్యచంద్రరావు 11వ వర్ధంతి కార్యక్రమాలు స్థానిక నల్లా గార్డెన్స్, పాత ఫైర్‌స్టేషన్ సెంటర్లలో గురువారం నిర్వహించారు. స్థానిక మహిపాలవీధిలోని చంద్రరావు విగ్రహానికి రాష్ట్ర కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్, రాష్ట్ర కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా విష్ణుమూర్తి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గడియారం స్తంభం సెంటరులో వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. సూర్యచంద్రరావు కుమారులు నల్లా అజయ్, నల్లా సంజయ్, సూదా గణపతి, గమ్మళ్ల సురేష్, పత్తి దత్తుడు, నల్లా చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అమలాపురం టౌన్: స్థానిక షాదీఖానా భవన ప్రాంగణంలో అమలాపురం జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం గురువారం ప్రారంభమైంది. గురు, శుక్ర, శనివారాల్లో మూడు రోజుల పాటు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. పార్టీ నేతలు డీఎంఆర్ శేఖర్, నల్లా శ్రీధర్‌లతో పాటు జీఎస్ఎల్ హాస్పటల్స్, నల్లా ఇంద్రాణి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో యాళ్ల నాగ సతీష్, యేడిద శ్రీను, ఇసుపట్ల రఘుబాబు, లింగోలు పండు తదితరులు పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యేల బృందం

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ నూతన భవన నిర్మాణం కోసం గోవా అసెంబ్లీ నిర్మాణ నమూనా, మౌలిక వసతులను అధ్యయనం చేయడానికి స్పీకర్ సెల్వం నేతృత్వంలో బయలుదేరి వెళ్లిన 22 మంది ఎమ్మెల్యేల బృందం గురువారం గోవా గవర్నర్ పీఎస్ శ్రీధరన్ పిళ్లైను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం గోవా అసెంబ్లీ భవన నిర్మాణాన్ని, అక్కడి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఎస్పీకు గాయాలు

యానాం: యానాం ఎస్పీ రఘునాయగం సైక్లింగ్ చేస్తుండగా వెనక నుంచి ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఆయన స్వల్పంగా గాయపడ్డారు. సీఐ షణ్ముగం తెలిపిన వివరాల ప్రకారం ఎస్పీ రఘునాయగం వ్యాయామం కోసం దొమ్మేటిపేట వద్ద సైకిలింగ్ చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన నడుముకు గాయమైంది. స్థానికులు హుటాహుటీన స్పందించి యానాం జీజీహెచ్‌కు తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించారు. ఆర్ఏఓ మునిస్వామి ఆధ్వర్యంలో మెరుగైన చికిత్స కోసం ఎస్పీను కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించారు.

నిజమైన నాయకుడు సీఎం జగన్



గూడపల్లిలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజమైన నాయకుడని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండలంలోని గూడపల్లి, పల్లిపాలెంలో గురువారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గత 75 సంవత్సరాల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా చరిత్రలో మొట్టమొదటిసారిగా మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన సీఎం జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేశనపల్లి, తూర్పు పాలెం గ్రామాల్లో కూడా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో మాదిగ సామాజికవర్గం మరియు ఇతర వర్గాలు వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని ఇజ్రాయిల్ కోరారు. కార్యక్రమంలో గూడపల్లి సర్పంచ్ సుందర బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.